క్లుప్తంగా

దర్గా స్థలం కాపాడండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ముస్లింలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలపరిధిలోని కుకునూర్ గ్రామ శివారులో దర్గా, ఖబరస్తాన్‌కు చెందిన స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని పలువురు ముస్లింలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. భూకబ్జాను అరికట్టి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. భూకబ్జాను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే తమను బూతులు తిడుతున్నారని వాపోయారు.

నలుగురు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక



ఎన్నికైన కోఆప్షన్ సభ్యులతో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, తదితరులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీలో నలుగురు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ పూర్తి కాగా, అధికారులు గురువారం అధికారికంగా ప్రకటించారు. మైనారిటీ కోటాకింద అహ్మద్, మహమ్మద్ కౌసర్ బేగం, ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం ఉన్న కోటాలో పాతూరి ప్రభావతి, ఐరేపి పృథ్వీరాజ్ ఎన్నికయ్యారని మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి ప్రకటించారు. నలురుగు సభ్యులను మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు సన్మానించారు.

గొర్రెల పెంపకందారులకు అవగాహన



కరపత్రాలతో అధికారులు

తూప్రాన్: గొర్రెల పెంపకందారులకు పట్టణంలోని రైతు వేదికలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీ్వ సీఈఓ వెంకటశైలేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం కులవృత్తులను ప్రొత్సహించేందుకు 2017లో గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించిందన్నారు. పశువైద్యాధికారిణి లక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో 749 యూనిట్లను మొదటి ఫేజ్‌లో పంపిణీ చేశామన్నారు. 376 యూనిట్లు ఫేజ్ 2 లో ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ రమేశ్, పశు వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, యాదవ సంఘం నాయకులు మల్లేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, గొర్రె కాపారులు పాల్గొన్నారు.

మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): వచ్చే హరితహారం నాటికి నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని డీఏఓ, మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కౌడిపల్లిలో గ్రామ నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని చెప్పారు. రహదారి వెంట నాటిన మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతిలో కొలువైన పురాతన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి మే 9 వరకు నిర్వహించనున్నారు. 29న పుణ్యవచనం, కంకణధారణ, పుట్టమట్టితో బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ నిత్యపూజలు, హోమం , బలిహారణం, పల్లకీ సేవ నిర్వహించడంతో పాటు వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు. మే 8వ తేదీన ఉదయం రథోత్సవం. 9న నాగవెల్లి, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

టేక్మాల్ ఎస్ఐగా రమేష్



టేక్మాల్(మెదక్): టేక్మాల్ నూతన ఎస్ఐగా రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన లింగం మెదక్ ఎస్ఐ–2గా బదిలీ కాగా, ఆయన స్థానంలోకి మెదక్ ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రమేష్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఒకే రోజు పది కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నార్సింగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, తదితరులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని పలు గ్రామాలు, గిరిజన తండాల్లో గురువారం ఒకేరోజు పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయిన దృష్ట్యా రాత్రికి రాత్రే నిర్ణయం తీసుకొని ఒకేరోజు పది కేంద్రాలు ప్రారంభించారు. ఎంపీపీ చిందం సబిత, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, నార్సింగి సహకార సంఘం చైర్మన్ శంకర్‌గౌడ్ బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి నార్సింగిలో రెండు, జప్తిశివునూర్, శంకాపూర్, శంకాపూర్ తండా, శేరిపల్లి, నర్సంపల్లి, వల్లూరులో ఒకొక్కటి, నర్సంపల్లి తండాలో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎర్రం అశోక్, షేక్ షరీఫ్, మల్లేశం, చత్రియా, సుజాత, మండల రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు అంచనూరి రాజేశ్, ఎంపీటీసీ సత్యనారాయణ, నార్సింగి ఉప సర్పంచ్ యోగి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు విష్ణువర్ధన్, ఇతర నాయకులు తౌర్యానాయక్, శ్రీపతిరావు, నరసింహాచారి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కౌల్దారం మండలంలో నేడు..

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడ్, అంసాన్‌పల్లి, కౌల్దారం, పోతంశెట్టిపల్లి, చిన్నఘనాపూర్, వరిగుంతం, సంగాయిపేట, రంగంపేట, ఎనగండ్ల గ్రామాల్లో శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా తెలిపారు.

వడియారంలో కొనుగోలు కేంద్రం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి జయరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాల్లో తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు తిరుమల, ఎంపీటీసీ లక్ష్మీరమేశ్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఎంపీడీఓ ఆనందమేరీ, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఏఈఓ శోభతో సీసీ స్వామి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ అసంతృప్తి

గ్రంథాలయాలను సందర్శించిన ప్రతిమాసింగ్



చిన్నశంకరంపేట: సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రంథాలయ పనితీరుపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సభ్యులు ఎంత మంది ఉన్నారు.. రెగ్యులర్‌గా ఎంత మంది పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్తారని ఆరా తీశారు. పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉంచడం లేదని గ్రహించిన ఆమె నూతనంగా పుస్తకాలు ఇవ్వడం ఎందుకని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణను ప్రశ్నించారు. గ్రంథాలయాలను సరైన తీరులో నడపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పరిశీలనకు వచ్చేలోగా గ్రంథాలయ పనితీరులో మార్పు కన్పించాలని హెచ్చరించారు.

రామాయంపేటలో...

రామాయంపేట(మెదక్): జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ చైర్మన్ జితేందగౌడ్ గురువారం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీలో పుస్తకాలు ఎన్ని ఉన్నాయంటూ ఆరా తీశారు. గ్రంథాలయాన్ని యువకులు, విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి ఉన్నారు.

గురువు ఉపదేశంతోనే మోక్షం



ఫాజిల్ ఉప సమాధి వద్ద ప్రార్థనలు

కౌడిపల్లి(నర్సాపూర్): గురువు ఉపదేశంతోనే మోక్షమార్గం లభిస్తుందని ఖాజా మహ్మద్ హకీం షరీఫ్‌చిస్తి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంతారంలో సద్గురు హజ్రత్ ఖాజా ఫాజిల్ అఫ్జల్‌వలి చిస్తి ఉప సమాధి 34వ ఆరాధన నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం ఫాజిల్ చిస్తి ఉప సమాధి వద్ద చాదర్ సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతాలు, ప్రాంతాలు వేరైన దేవుడు ఒక్కడేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్మీకి మనవంతు చేయూత అందించాలి

రామాయంపేట(మెదక్): భారత ఆర్మీకి మనవంతు సహకారం అందించాలని మున్సిపల్ చైర్మన్ జితేందదర్‌గౌడ్ అన్నారు. సాందీపని వేద గురుకులం, శ్రీకృష్ణ వేద గోశాల ఆధ్వర్యంలో మధుర గార్డెన్‌లో జరిగిన సమావేశంలో చైర్మన్ పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా గ్రూపు మహిళల ద్వారా విరాళాల సేకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, గురుకులం ప్రతినిధులు సంగమేశ్వర్, ఎర్ర ముత్యాలు, రవీందర్, వీహెచ్‌పీ జిల్లా సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి



ర్యాలీలో సగర సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో గురువారం సగర సంఘం సభ్యులు భగీరథ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు చిత్తారమ్మ ఆలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఎక్సైజ్ సీఐ జయసుధ, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మరుకు దత్తు, జిల్లా సంయుక్త కార్యదర్శి మర్గు నగేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన



వంటావార్పులో వీఓఏలు

మనోహరాబాద్(తూప్రాన్): తమ డిమాండ్లను ప్రభుత్వం నేరవేర్చాలని ఐకేపీ వీఓఏలు వంటావార్పుతో నిరసన తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వీఓఏల దీక్షలలో భాగంగా ప్రధాన చౌరస్తా వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. జిల్లా పంచాయతీ కార్మికుల ఉపాధ్యక్షుడు ఆసిఫ్ మద్దతు తెలిపాడు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పబ్బ మహేష్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధి శభాష్‌పల్లికి చెందిన నాసర్మియా అనారోగ్యంతో మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన ఫయాజ్ ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబాలను పరామర్శి రూ. 5 వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే దొంతి గ్రామానికి చెందిన చాకలి శంకరమ్మ మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి సత్యం, మండల కో ఆప్షన్ మెంబర్ లాయక్, బీఆర్ఎస్ నాయకులు పిట్ల సత్యనారాయణ, శ్రీనివాస్, భిక్షపతి, చిన్న సత్యనారాయణ, విఠల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

చేగుంట(తూప్రాన్): పులిగుట్ట తండా బాధితులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజిరెడ్డి ఆర్థిక సాయం అందించారు. మాసాయిపేట మండలం పులిగుట్ట తండాలో చందర్, రతన్‌లకు చెందిన పూరి గుడిసెలు రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రాజిరెడ్డి వారిని పరామర్శించి రూ.15వేలు అందజేశారు. సర్పంచ్‌లు మోహన్ రాథోడ్, స్వాతిశ్రీనివాస్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ వినోద

చిలప్‌చెడ్(నర్సాపూర్): రెండో విడత కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వినోదరెడ్డి, సర్పంచ్ అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం మండలపరిధిలోని అంతారంలో కంటివెలుగును వారు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల బీజేపీ కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం10 గంటలకు ఈ సమావేశం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, మోర్చాల కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలన్నారు.

◆ గుడిసెలు లేని తండాలుగా మారుస్తాం

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గుడిసెలు లేని తండాలుగా తీర్చిదిద్దుతానని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతాన్‌పల్లి పోతాన్‌పల్లి తండాల్లో గురువారం ఆయన ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, స్టాలిన్‌నర్సింలు, అంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ రైతుకు చెక్కు అందజేత

రామాయంపేట(మెదక్): రామాయంపేట సహకార సంఘం పరిధిలోని నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామానికి చెందిన రైతు బాపురెడ్డికి కోళ్లఫారం నిర్మాణం నిమిత్తం రూ.8లక్షల చెక్కును సంఘం చైర్మన్ బాదె చంద్రం గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పుట్టి నర్సింలు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 28న కౌడిపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలిపారు.

◆ అభివృద్ధి పనులు భేష్



మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు బాగున్నాయని హిమాచల్‌ప్రదేశ్ ప్రజా ఇన్నా రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు, అధికారులు బగంగ్, తాబిన్‌మరా, జరంగ్, దల్ నర్సమ్, తంగల్ కొనియాడారు. గురువారం మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. నర్సరీ, ఆయిల్‌పామ్, డంపుయార్డు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికను పరిశీలించారు.

◆ నిధులు విడుదల చేయాలి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా నాలుగైదు నెలలుగా వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

◆ ఆర్థికసాయం

మెదక్ రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాస గృహాలు దగ్ధమై నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్ గురువారం ఆర్థిక సాయం చేశారు. హవేళిఘణాపూర్ మండలం కుచన్‌పల్లి గ్రామానికి చెందిన ఏశయ్య, నర్సింలుకు చెందిన నివాస గృహాలు ఇటీవల దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25వేల చొప్పున రూ. 50వేల చెక్కు అందజేశారు.

◆ ముగిసిన పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కొండాపూర్‌లో వెలిసిన పెద్దమ్మ ఆలయ ఐదవ వార్షికోత్సవాలు గురువారం సాయంత్రం బోనాల ఊరేగింపుతో ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పంట నష్టం వివరాలు సేకరిస్తున్న ఏఓ నాగమాధురి

పంట నష్టం వివరాల సేకరణ

మెదక్ రూరల్: ఈదురు గాలులు, వడగండ్ల వానతో రైతులకు జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి నాగమాధురి పేర్కొన్నారు. గురువారం హవేళి ఘణాపూర్ మండల పరిధిలోని బ్యాతోల్, ఔరంగాబాద్, కుచన్‌పల్లి, సుల్తాన్‌పూర్, బూరుగుపల్లి, గంగాపూర్ గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వివరాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు, సర్పంచ్‌లు, నాయకులు, రైతులు ఉన్నారు.

కౌల్దారంలో..

కౌల్దారం(నర్సాపూర్): రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మండలంలోని సంగాయిపేట, రంగంపేట గ్రామాల్లో దెబ్బతిన వరి పొలాలను గురువారం ఏఈఓ నిరోష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడగండ్లకు గింజలు రాలిపోయాయని రైతులు ఏఈఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.



వరిని పరిశీలిస్తున్న ఏఈఓ, రైతులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి



అవగాహన సదస్సులో ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): స్వచ్ఛభారత్‌ను విజయవంతం చేసేందుకు స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని చిన్నశంకరంపేట ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి కోరారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో స్వచ్ఛభారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడంతో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్వచ్ఛభారత్ ట్రైనర్ రాజేష్ మాట్లాడుతూ గ్రామాలలో మురుగునీటి నిర్వహణ, తడి చెత్త పొడి చెత్త సేకరణ, మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు, ఏపీఓ వెంకటసాయి పాల్గొన్నారు.

అప్పాజీపల్లిలో కార్డన్ సెర్చ్

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లిలో మెదక్ రూరల్ సీఐ విజయ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మూఢనమ్మకాలు, తదితర అంశాలపై సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్ గౌడ్, శేఖర్, విజయ్, మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్

సీఈఐఆర్‌పై పోలీస్ అధికారులకు శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం సెంట్రల్ ఎక్విప్‌మెంట్(సీఈఐఆర్) ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్‌పై జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఐఆర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు యాదగిరిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పోలీస్ అధికారులు

గిడ్డంగులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కౌడిపల్లిలో వ్యవసాయ గిడ్డంగుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాంకుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు వ్యవసాయ గిడ్డంగులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యాంకుమార్ తెలిపారు. గురువారం కౌడిపల్లిలోగల మహ్మద్‌నగర్ సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్లు, రైతులకు వ్యవసాయ గిడ్డంగుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి స్థానిక గిడ్డంగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూపండించిన పంటకు గిట్టుబాటు ధర లేనప్పుడు నామమాత్రపు చార్జీలతో వ్యవసాయ గిడ్డంగులలో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవడం ద్వారా మంచి లాభాలు వస్తాయని చెప్పారు. వ్యవసాయ గిడ్డంగులలో 50కిలోల బస్తాకు రూ.5 అద్దె చెల్లించాల్సి ఉంటుందని, ఇందులో రైతులకు ప్రభుత్వం 30శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇన్సూరెన్స్ సైతం వర్తిస్తుందన్నారు. రైతులు నిల్వ చేసిన ధాన్యానికి బ్యాంకులు 80శాతం రుణాలు ఇస్తాయన్నారు. ధాన్యం అమ్ముకున్న తర్వాత బ్యాంక్ రుణాలు, అద్దె సక్రమంగా చెల్లిస్తే వడ్డీ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్య, డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్లు నరేష్, శ్రీమాన్, సొసైటీ డైరెక్టర్ రాములు, సీఈఓ దుర్గాగౌడ్, సిబ్బంది సుధాకర్, విష్ణు, కిషన్, అనీల్, ఆత్మ డైరెక్టర్ మోతిలాల్‌గౌడ్, మాజీ డైరెక్టర్ చంద్రం, రైతులు గోపాల్‌రెడ్డి, యాదయ్య తోడేల్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

కొండపాక(గజ్వేల్): అంధత్వ రహిత తెలంగాణే మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లిలో గురువారం ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకునేలా ఏఎన్ఎం, ఆశావర్కరు, పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు బచ్చలి మహిపాల్, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, ఎంపీడీవో రాంరెడ్డి, ఉపసర్పంచ్ బట్టు లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అర్షద్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాల శంకర్, లీడర్లు లక్ష్మణ్, కోల రవీందర్, రాజలింగం, కిష్టారెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాత్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి